క్లుప్తంగా

అత్యవసర వైద్య సేవలపై అవగాహన



శిక్షణకు హాజరైన ఈఎంటీ సిబ్బంది

టెక్కలి: ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు అత్యవసర వైద్య సేవలపై అవగాహన ఉండాలని జిల్లా ఏఈఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, వోఈ రంగప్రసాద్ అన్నారు. 108 వాహనాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర వైద్య సేవలపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రసూతి వైద్య సేవలు, శిశు పరిరక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయిలో 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల మైదానాల్లో బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఆడుదాం-ఆంధ్రా నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ తదితర క్రీడల్లో పోటీలు ఉంటాయన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను అధికారులు జారీ చేశారు. ఈ మేరకు టెక్కలిలోని సార్వత్రిక విద్యా పీఠం కేంద్రంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆసక్తి ఉన్న వారు. ఈ నెల 30 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక సిబ్బంది మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిరుపేదలకు దుస్తులు పంపిణీ

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి గోపినాథపురం గ్రామానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హనుమంతు వీరన్న జ్ఞాపకార్థం పలువురు నిరుపేదలకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. వీరన్న మనుమడు నాయుడుగారి రాజశేఖర్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తారు పృథ్వీ ఉన్నారు.

విధుల్లోకి అంగన్‌వాడీలు



టెక్కలి: సమ్మెను విరమిస్తూ నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

టెక్కలి: సమ్మె బాట పట్టిన అంగన్‌వాడీలు మంగళవారం నుంచి తమ సమ్మెను విరమించారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర నాయకులు ప్రభుత్వంతో చేసిన చర్చలు జయప్రదం కావడంతో స్థానికంగా అంగన్‌వాడీలు సమ్మెను విరమిస్తూ విధుల్లోకి చేరుతున్నట్లు ప్రకటించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలోని సమ్మె శిబిరాన్ని ఎత్తివేశారు.

నేడు గిరిజనుల శాంతియుత ర్యాలీ

మందస: గిరిజనులు శాంతియుత ర్యాలీని పలాసలో బుధవారం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం ఉపాధ్యక్షుడు సవర డొంబురు, పార్టీ నాయకులు సవర రాము, సవర ఢిల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒడియా, బెంతొరియా తదితర కులాలను ఎస్టీలుగా గుర్తించవద్దన్నారు. మేథ స్కూల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

- ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్రా మీనా



సిబ్బందితో సమీక్షిస్తున్న రాఘవేంద్రా మీనా

కోటబొమ్మాళి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్రా మీనా ఎన్నికల సెక్టోరియల్ అధికారులను ఆదేశించారు. కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎన్నికల సెక్టోరియల్ అధికారులతో మంగళవారం సమీక్ష చేశారు. అంతకుముందు నీలంపేట పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, డ్వామా ఏపీవో అరుణ్‌కుమార్, ఏవో ఎస్.గోవిందరావు, ఈవోపీఆర్డీ తులా రాజారావు ఉన్నారు.

సంక్షేమానికి సార్థకత

- ప్రగతి పథంలో పల్లెలు
- మంత్రి సీదిరి అప్పలరాజు



పొత్తంగిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

మందస: ఐదేళ్ల పాటు ప్రజలు అందుకున్న సంక్షేమానికి సార్థకత చూపించే సమయం ఆసన్నమైందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి మరింత సంక్షేమాన్ని అందుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భోగాపురం, పొత్తంగిలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజారంజక పాలన కొనసాగిందన్నారు. టీడీపీ ప్రభుత్వం సాగించిన అవినీతి, అశ్రితపక్షపాతం, జన్మభూమి కమిటీల దోపిడీ, రాక్షసరాజ్యం, అణచివేతల నుంచి ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నారన్నారు. ఎంతో నమ్మకంతో జగనన్నను సీఎంగా చేసుకున్నామని, ప్రజల నమ్మకాన్ని ఆయన ఎన్నడూ వమ్ము చేయలేదన్నారు. గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్రం అడుగులు వేసిందన్నారు. ప్రతీ పల్లెలోనూ ప్రగతి కనిపిస్తోందన్నారు. అర్హులందరికీ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. భోగాపురంలో ఒకే చోట అన్ని ప్రభుత్వ భవనాల నిర్మాణం శోభ చేకూర్చిందన్నారు. టీడీపీ హయాంలో ఈ ప్రాంతం ఎంతో నిర్లక్ష్యానికి గురైందని, కనీసం రహదారులు కూడా నిర్మించలేదన్నారు. ప్రస్తుతం మౌలిక సదుపాయాలు కల్పించబడ్డాయన్నారు. సిరిపురం-పొత్తంగిల మధ్య బ్రిడ్జి నిర్మాణం 60 ఏళ్ల కుటుంబ, టీడీపీ పాలనలో జరుగలేదన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో ఇప్పుడు సోంపేట-మందస మండలాలకు రాకపోకలకు సౌకర్యం కలిగిందన్నారు. రాబోయే ఎన్నికలు ఎంతో కీలకమని.. అభివృద్ధికి, నిర్లక్ష్యానికి జరుగుతున్న సమరమేనన్నారు. రాబోయే ఎన్నికలు దగ్గర పడ్డాయని, సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలకు వచ్చిన మంత్రికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కాగా ఉత్తమ సేవలు అందించిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ పి.భాస్కరరావును మంత్రి అప్పలరాజు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దల్లి జానకీరావురెడ్డి, మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, వ్యవసాయాధికారి జి.నాగరాజు, పీఆర్ ఏఈ కణితి కృష్ణారావు, సర్పంచ్‌లు దల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, హేమలతసాహు, సారి రంజితచౌదరి, గున్న రమణ, కర్రి గోపాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు రమేష్‌పంతులు, పార్టీ నాయకులు పద్మనాభంచౌదరి, బోర గణపతి, ప్రసన్నకుమార్‌చౌదరి, అగ్గున్న కిరణ్ కుమార్, సూర్యసాహు, తెలుకుల కురా, పోలేటి భుబని, బొంగి జీవన్‌రావు, దుదిష్టి, పద్మన్‌ప్రధాన్ ఉన్నారు.

హుద్‌హుద్ ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించాలి

- టెక్కలి మండల సమావేశం



సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

టెక్కలి: మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎంపీటీసీ సభ్యురాలు సత్తారు ఉషారాణి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత టీడీపీ ప్రభుత్వంలో విస్మరించిన హుద్‌హుద్ ఇళ్లను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిరుపేద లబ్ధిదారులకు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. వీటికి విద్యుత్ సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యుత్, హౌసింగ్ అధికారులకు విన్నవించారు. దీనిపై తహసీల్దారు ప్రవల్లిక మాట్లాడుతూ.. తక్షణమే ఆయా సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు చేసే సమయంలో కొంత మంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని అటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సభ్యురాలు ఉషారాణి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు శాఖల వారీగా ప్రగతిని వివరించారు. సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి, ప్రజాప్రతినిధులు కె.పార్వతి, బి.దేవయాని, జి.శ్రీలత, పి.దేవి, జి.రాజేష్, ఎస్.అప్పలరెడ్డి, పి.ఫాల్గుణరావు, కోఆప్షన్ సభ్యుడు హేరంబో, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్ల అందజేత



క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న రామారావు, సాయిరాజ్

కంచిలి: రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తున్న 'ఆడుదాం- ఆంధ్రా' కార్యక్రమంతో గ్రామీణ క్రీడాకారుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌లు అన్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ద్వారా ఆడుదాం-ఆంధ్రా టోర్నమెంట్ కోసం మంజూరైన వివిధ క్రీడా కిట్లను మంగళవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, లడ్డుకేశవపాత్రో, కొల్లి ఈశ్వరరావు, కొణపల సురేష్, ఎంపీడీవో నీరజ ఉన్నారు.

సోంపేటలో..

సోంపేట: మండలంలోని క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో రాణించాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ ఆకాంక్షించారు. నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెర్సీలను పంపిణీ చేశారు. ఎంపీడీవో బి.వెంకటరమణ, సుంకిడి సర్పంచ్ శిలగాన భాస్కరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

నేతాజీకి ఘనంగా నివాళి



సంతబొమ్మాళి: నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కంచిలి: జెడ్పీ ఉన్నత పాఠశాలలో చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఇచ్ఛాపురం రూరల్: నేతాజీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, స్వచ్ఛందసంస్థలు మంగళవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు వక్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సేవలను కొనియాడారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మదనాపురంలో బావిని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి తదితరులు

నందిగాం: కల్లాడ పంచాయతీ మదనాపురంలో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. కల్లాడ, కైజోల, మదనాపురం తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు మడపాల తిరుపతిరావు మదనాపురంలో మంచినీటి సమస్య ఉందని ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నాయకులతో కలిసి స్థానికంగా ఉన్న బావిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతిఇంటికీ కుళాయిలు వేసి నీటిని అందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కల్లాడ, కైజోలలో పర్యటించి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆదరించాలని కోరారు. మండలపార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, నాయకులు చిన్ని జోగారావు, కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, పడ్డ బుల్లినాయుడు ఉన్నారు.

రూ.36.55 కోట్ల ఆసరా నిధులు జమ



మందస: సీఎం జగన్ ప్రసంగాన్ని వింటున్న మహిళలు



వజ్రపుకొత్తూరు: కార్యక్రమంలో స్వయంశక్తి సంఘాల మహిళలు



ఇచ్ఛాపురం: ఆసరా అర్హుల జాబితాను చూపిస్తున్న స్వర్ణమణి

మందస: మండలానికి సంబంధించి 16,638 మంది స్వయంశక్తి సంఘాల మహిళలకు రూ.36,65,36,948 నిధులు వారి ఖాతాల్లో జమ అయినట్టు సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు చెప్పారు. ఈ మేరకు మంగళవారం అంబుగాం రైతు భరోసా కేంద్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా నిధుల విడుదలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా మహిళలు వీక్షించారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాడువు సంఘాలకు వరుసగా నాలుగో ఏడాది రూ.12.82 కోట్లు ఆసరా నిధులను జమ చేశామని వెలుగు పీఎం కె.జాంభవతి తెలిపారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్క, చెల్లెమ్మల ఖాతాల్లో ఆసరా లబ్ధి నేరుగా ఖాతాలకు జమ చేసిన కార్యక్రమాన్ని అన్ని గ్రామ సచివాయాల్లో స్వయం శక్తి సంఘాల మహిళలు టీవీల్లో వీక్షించారు. 1638 సంఘాల్లో మహిళలకు ఈ పథకం వర్తింపజేసినట్టు సిబ్బంది తెలిపారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు జల్లు ఉషారాణి, సీసీలు ధనలక్ష్మి, మంగమ్మ, ఉష ఉన్నారు. మహిళా సంఘాలకు 'ఆసరా'

ఇచ్ఛాపురం: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్-2 లాబాల స్వర్ణమణి అన్నారు. మున్సిపాలిటిలోని 7, 8, 12, 13, 14, 15 సచివాలయాల్లో నాలుగోవిడత వైఎస్సార్ ఆసరా పథకం నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని మహిళలు వీక్షించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, నాయకులు త్రినాథ్, నీలాపు ఢిల్లి, పిలక విజయ్‌భాస్కర్, మెప్మా సిబ్బంది ఉన్నారు.

వరదగట్టు పనులు ప్రారంభం

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడులో రూ.8 లక్షలతో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పుచ్చవారి వరదగట్టు పనులను వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి మంగళవారం ప్రారంభించారు. అర్హులైన వారికి జాబ్ కార్డులు అందజేసి పనులు కల్పించాలని, రోజుకు రూ. 200 పైగా వేతనం గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పెద్ద దున్న వీరాస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ జోగారావు ఉన్నారు.

నవరత్నాలతో ఆర్థికాభివృద్ధి

- జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ
- శిలగాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు బ్రోచర్‌ను అందజేస్తున్న పిరియా విజయ, నర్తు రామారావు

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల ఆర్థికాభివృద్ధికి సోపానాలుగా నిలిచాయని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ అన్నారు. శిలగాం సచివాలయం పరిధిలోని గొర్లెపాడు పంచాయంలో 274వ రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల పాలనలో వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. అర్హత ఉండి పథకాలు పొందడంలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులు ఉన్నవారితో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. వారి సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ మండల కన్వీనర్ కె.ప్రకాష్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి, కంచిలి ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వై.నీలయ్య, వై.అశోక్, స్థానిక సర్పంచ్ కె.హేమలత, గొర్లెపాడు సర్పంచ్ కరగాన వసంత, నేతలు బద్రి ప్రకాష్, మురపాల లచ్చయ్య, కడియాల బాబూరావు, కొర్రాయి గోపాల్ ఉన్నారు.

ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలపాలి

- మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్



ఇస్కలపాలెంలో మాట్లాడుతున్న సాయిరాజ్

సోంపేట: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు, కార్యకర్తలు సంపూర్ణ మద్దతు తెలపడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉందామని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పిలుపునిచ్చారు. ఇస్కలపాలెం, రుషికుద్ద పంచాయతీల్లోని కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల పరిధిలోని సమస్యలు, అభివృద్ధి పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకువస్తే అందించడానికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ అందజేస్తున్న పాలనకు తేడాను గమనించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కాకుండా సంక్షేమాన్ని ఇంటి వద్దకే అందజేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, ఎస్సైసెల్ జిల్లా కార్యదర్శి నగిరి బెనర్జి, పార్టీ నాయకులు బైపల్లి రామారావు, పాడుగు కామేష్, బైపల్లి తిరుపతిరావు, సంది రాజు, కర్రి కామేశ్వరరావు ఉన్నారు.

అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

కంచిలి: అన్నివర్గాల అభివృద్ధే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండల కేంద్రం కంచిలిలో బలియాపుట్టుగ గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కన 45 మంది ఆటో డ్రైవర్లకు ఇళ్ల స్థలాల కేటాయింపును లాటరీ పద్ధతిలో ప్రకటించి.. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌తో కలిసి మంగళవారం సాయంత్రం అప్పగించారు. ఈ సందర్భంగా సాయిరాజ్ మాట్లాడుతూ.. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా పరిష్కారం కానీ ఆటో డ్రైవర్ల స్థల సమస్యను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో.. తమ సమక్షంలో న్యాయం చేయడం జరిగిందని గుర్తుంచుకోవాలన్నారు. ఇక ముందు కూడా ఈ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కూడా చేపడతామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్.హైమావతి, లడ్డు కేశవపాత్రో, కొల్లి ఈశ్వరరావు, కొత్తకోట శేఖర్, సాహుకారి చిరంజీవులు, డొక్కరి నారాయణ పాల్గొన్నారు.

60 ఏళ్లకు కలిశారు



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పలాస, కాశీబుగ్గ: మండలంలో గల బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1963-64 సంవత్సరంలో 10వ తరగతి చదుకువున్న వారు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలు నెమరువేసుకుని గురువులను సత్కరించారు. పాఠశాలకు రూ.30 వేల విలువ గల కంప్యూటర్‌ను వితరణగా అందించారు.

సంక్షిప్తంగా...

శివాజీనగర్‌లో ఆసరాపై అవగాహన

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 20వవార్డు శివాజీనగర్‌లో వైఎస్సార్ అసరాపై మహిళా సంఘం సభ్యులకు మంగళవారం అవగాహన కల్పించారు. వార్డు కౌన్సిలర్ అంబటి మాధురి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. కేవలం 16 సంఘాలకు రూ.50 లక్షలకుపైగా నాలుగో విడతలో ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమచేసిందన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ మూడోవార్డు పద్మనాభపురం, జయరామచంద్రపురం గ్రామాల తరపున సేవా కార్యక్రమాలు చేపట్టారు. పద్మనాభపురం గ్రామ మండపం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో 40 కుటుంబాలకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్లు అందించారు. నిర్వాహకులు కిక్కర ప్రకాశరావు, రంది రాజారావు, అఖిలేష్ యాదవ్, కిక్కర ఆదినారాయణ, కిక్కర బాలకృష్ణ, డొక్కరి లోకనాథం, పిన్నింటి చిన్నారావు, బద్రి నాగార్జున ఉన్నారు.

దయాలసిస్ రోగికి సాయం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ ఐదోవార్డు తాళ్లబద్ర గ్రామానికి చెందిన నొపడ శ్రీనివాస్ కిడ్నీవ్యాధితో బాధపడుతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న రక్తదాత గ్రూపు ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 వేలు సాయం అందించి అండగా నిలిచారు.

గులిరాగి సాగుపై అవగాహన

సోంపేట: గులిరాగి పద్ధతిలో పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తితో కలిసి కొర్లాం గ్రామానికి చెందిన రైతులు పెద్దింటి ఢిల్లీరావు, నూకల పున్నయ్య క్షేత్రాల్లో గులిరాగి సాగుపద్ధతిలో తీసుకోవాల్సిన మెలకువలపై మంగళవారం అవగాహన కల్పించారు.

ముమ్మరంగా కులగణన సర్వే

కోటబొమ్మాళి: మండలంలోని 27 సచివాలయాల పరిధిలో కులగణన సర్వే ముమ్మరంగా జరుగుతోంది. ఈనెల 28వ తేదీ వరకూ నిర్వహించే సర్వే కోసం వచ్చే సిబ్బంది, వలంటీర్లకు ప్రజల సహకరించాలని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ కోరారు. మంగళవారం నాటికి మండలంలో 56 శాతం కులగణన సర్వే పూర్తయినట్టు చెప్పారు.

వైద్యానికి ప్రాధాన్యం



పలాస: బ్రాహ్మణతర్లా రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడులో రోగికి ప్రిస్కిప్షన్ అందిస్తున్న ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ



కంచిలి: బూరగాంలో రోగికి కేస్ షీట్‌ను ఇస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని నాయకులు, అధికారులు అన్నారు. జగనన్న సురక్ష రెండో విడత శిబిరాలు పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించి మందులను అందజేశారు. గ్రామ వాలంటీర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.